కె. బి. కృష్ణ

# చిత్రం

రాత్రి పన్నెండవుతోంది.

ఒక వారం రోజులనుంచి నన్ను వేధిస్తున్న కొంతమంది బంధువులను అప్పుడే బస్ ఎక్కించి, బస్‌స్టాండ్ నుంచి ఇంటికి వస్తున్నాను.

ఎదురుగా ఇంజనీరు ప్రసాదరావుగారు వస్తున్నారు.

"ఏమిటిసార్ ఈ సమయంలో...." అన్నాను.

"సడెన్‌గా నిద్రమెలకువ వచ్చిందండి. సిగరెట్లులేవు. కొనుక్కుపోదామని వెళుతున్నాను" అంటూ వడివడిగా వెళ్ళిపోయారాయన.

కొంచెందూరం నడిచేటప్పటికి డా॥ కిరణ్ హడావిడిగా వెళుతూ ఎదురయ్యారు.

"ఏమిటిసార్ ఇంత రాత్రివేళ వెళుతున్నారు?" అన్నాను.

"రిలేషన్స్ వస్తారని బస్‌కోసం వెళుతున్నాను."

"ఎక్కడనుంచి?"

"హైదరాబాదు నుంచి" అని వెళ్ళిపోయారాయన.

హైదరాబాదునుంచి వచ్చే బస్సులు ఈ సమయంలో లేవు అని ఆయనకు చెప్పాలనుకుని, ఎందుకులే ఆయనే తిరిగివస్తాడని వూరుకున్నాను.

మరికొంచం దూరం నడిచేటప్పటికి మా సెక్షన్ ఆఫీసర్ ముకుందం తన సహచరులతో గబ గబా వెళుతూ ఎదురయ్యారు.

"నమస్తేసార్. ఏమిటి విశేషం? చాలా పొద్దుబోయింది" అన్నాను.

"హైదరాబాదు వెళ్దామని బయలుదేరాను. బస్‌స్టాండ్ దాకా వస్తామని వీళ్ళూ బయలుదేరారు" అని నా సమాధానంకోసం ఎదురు చూడకుండా వెళ్ళిపోయారాయన తనకూడా వున్న కొద్దిమందితో.

ఏమిటో—ఈ ప్రపంచంలో రాత్రిళ్ళు అందరూపడి నిద్దరపోతున్నారు అనుకుంటాం కాని కొంతమంది తిరుగుతూనే వుంటారు. ఇంటికి తిరిగివచ్చి నిద్రపోయాను.

తెల్లవారుతుండగా ఏదో గోలగావుంటే మెలకువ వచ్చింది. లేచి దేముని పటంచూసి వీధిలోకి వెళ్ళాను. కుర్చీలు నెత్తిమీద పెట్టుకుని వరు

సగా నడుస్తున్నారు కొందరు రోడ్డుమీద సైనికులు మార్చింగ్ చేస్తున్న ట్లుగా. వాళ్ళ ముఖాలు మాడిపోయి వున్నాయి. వాళ్ళ దగ్గిరకు వెళ్ళాను.

ఇంజనీరు ప్రసాదరావు తలమీద—

డా॥ కిరణ్ తలమీద—

సెక్షన్ ఆఫీసర్ ముకుందం, అతని సహచరుల తలలమీద కుర్చీలు—

కుర్చీలు—

తలలు భూమివేపు, తలమీద కుర్చీలు పెట్టుకుని నడుస్తున్నారు వాళ్ళు అందరితోపాటుగా—

అందరికంటె ముందుగా పైలట్‌లా సబ్ ఇనస్పెక్టర్, చివరలో గార్డ్సులా పోలీసులు.

వాళ్ళు అలా వెళుతుంటే జనం అనుకుంటున్నారు.

ఏమని?

"వీళ్ళందరూ రాత్రి వీడియోలో బ్లూ ఫిలిం చూస్తుంటే పట్టుకుని, తెల్లార్లూ స్టేషన్‌లో వుంచి, ఇంకెప్పుడూ చూడకుండా ఇలా వీధుల్లో తిప్పు తున్నారట" అని—

(బ్లూ ఫిలిమ్స్ చూసే వారందరికి క్షమార్పణలతో—రచయిత)

—o—

# చంటిబ్బాయ్

జ్యోతికి పెళ్ళయింది. జ్యోతి చాలా ఫాస్ట్ గాళ్. అయితే ఆమె ఆశలకు అనుగుణంగా ఆమె భర్త దొరక్కపోవడం ఆమెకు కించిత్ నిరాశ కలిగించింది.

తన భర్త మొదటిరాత్రి కూడా ముద్దపప్పులా ప్రవర్తించడంతో తన జీవితంలో వున్న ఫాస్ట్‌నెస్ అంతా కొన్నివేల క్రేన్స్‌తో వెనక్కు లాగేసినట్టయింది జ్యోతికి

"జ్యోతీ నా పెన్నెక్కడుందో చూడు"

"జ్యోతీ నా బట్టలు వుతికించు"